సాక్షి కామారెడ్డి

మంగళవారం । 9 । జూలై । 2024



ఫిర్యాదులను పరిష్కరించాలి

కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో 114 ఫిర్యాదులు నమోదయ్యాయి. కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఫిర్యాదులు స్వీకరించారు.

- 8లో ▸



కాలేజీ ఇక్కడ..

బీబీపేట జూనియర్ కాలేజీలో లెక్చరర్లు లేక పోవడంతో విద్యార్థులు పాఠాలు వినేందుకు దోమకొండ కళాశాలకు వెళ్లాల్సి వస్తోంది.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
35.8 /22.7

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. వాతావరణంలో తేమ అధికంగా ఉంటుంది. అక్కడక్కడ భారీ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

ముగిసిన తొలివిడత సర్టిఫికెట్ వెరిఫికేషన్



కామారెడ్డి అర్బన్: కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఎంసెట్ తొలి దశ సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియ సోమవారం ముగిసింది. ఈ విషయాన్ని కళాశాల ప్రిన్సిపాల్, ఎంసెట్ కౌన్సెలింగ్ జిల్లా సమన్వయకర్త విజయ్‌కుమార్ తెలిపారు. 874 మంది విద్యార్థుల ధ్రువీకరణ పత్రాలను పరిశీలించామని పేర్కొన్నారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తయిన విద్యార్థులు ఈనెల 15వ తేదీ వరకు కళాశాలల ఆప్షన్ ఇవ్వాలని సూచించారు. ఆప్షన్ ఇచ్చినవారికి 19న సీట్లను కేటాయిస్తామన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కిష్టయ్య, అధికారులు అజారుద్దీన్, అనిల్ కృష్ణ, ఫర్హీన్, సుచరణ్, ఆఫ్రీన్, శ్రీలత, రాంప్రసాద్, కనకరాజు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

'కేజ్ వీల్స్‌తో రోడ్లపైకి వస్తే చర్యలు'

కామారెడ్డి క్రైం: కేజ్ వీల్స్‌తో ట్రాక్టర్లను రోడ్లపై నడిపితే మోటారు వాహనాల చట్టం ప్రకారం చర్యలు తప్పవని ఎస్పీ సింధు శర్మ సోమవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఈ విషయాన్ని ట్రాక్టర్ల యజమానులు గమనించాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి అర్బన్ : హైదరాబాద్‌లోని ఎస్సీ స్టడీ సర్కిల్‌లో ఉచిత శిక్షణ కోసం సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్, మెయిన్స్ అభ్యర్థులు ఈ నెల 10 వరకు దరఖాస్తు చేసుకోవాలని ఎస్సీ సంక్షేమశాఖ జిల్లా అధికారి రజిత ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు వెంటనే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న వారికి ఈనెల 21న ఎంపిక పరీక్ష నిర్వహిస్తారన్నారు.

నేత్ర పర్వంగా జగన్నాథుడి రథయాత్ర



నిజామాబాద్‌అర్బన్: జగన్నాథుని రథయాత్ర జిల్లా కేంద్రంలో సోమవారం కనుల పండువగా సాగింది. ఇస్కాన్ ఇందూరు ఆధ్వర్యంలో చేపట్టిన యాత్ర భక్తుల జయజయ ధ్వానాల మధ్య వైభవంగా సాగింది. నగరంలోని పాత గంజ్ క్లాక్ టవర్ నుంచి ప్రారంభమైన యాత్ర గాంధీ చౌక్, శివాజీనగర్, పులాంగ్‌చౌరస్తా, హనుమాన్ జంక్షన్ నుంచి తిరిగి పులాంగ్ చౌరస్తా మీదుగా కోర్టు చౌరస్తా, తిలక్‌గార్డెన్, దేవి రోడ్డు మీదుగా గంజ్ క్లాక్ టవర్‌కు చేరుకుంది. రథంపై జగన్నాథుడు, బలదేవ్, సుభద్రామాయి విగ్రహాలను అలంకరించి ఊరేగింపు నిర్వహించారు. యాత్రలో భక్తులు భారీ సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు. భజనలు, కీర్తనలు, మహాహారతి, పల్లకీసేవ, ఊంజల్ సేవతో పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా హాజరయ్యారు. కార్యక్రమంలో ఇస్కాన్ నిజామాబాద్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

28న ఊర పండుగ జరుపుకోవాలి: యెండల



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: నగరంలో ఆషాడ మాసంలో ఆనవాయితీగా జరుపుకునే ఊరపండుగను ఈ నెల 28న నిర్వహించుకోవాలని సర్వసమాజ్ అధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సికింద్రాబాద్ మహంకాళి అమ్మవారి బోనాల పండుగ రోజున చేసుకునే ఇందూరు ఊరపండు గ నాడు గురుపౌర్ణమి వచ్చిందన్నారు. దీంతో మరుసటి రోజు ఆదివారం ఊరపండుగ నిర్వహించుకునేలా సర్వసమాజ్ కమిటీ సమావేశంలో తీర్మానం చేసినట్లు లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. నగర ప్రజలందరూ ఈ నిర్ణయం మేరకు ఊరపండుగలో పాల్గొని అమ్మవార్ల ఆశీర్వాదం పొందాలని కోరారు.

తిలాపాపం తలా పిడికెడు

'సమన్విత'లో అందరూ దోషులే!

- ఇష్టారాజ్యంగా అనుమతులు ఇచ్చిన వైద్యారోగ్య శాఖ
- కాసుల కోసం అడ్డదారులు తొక్కిన వైద్యులు
- చట్టవిరుద్ధంగా స్కానింగ్‌లు, అబార్షన్లు, శిశు విక్రయాలు..
- శిశు విక్రయం ఘటనతో వెలుగులోకి..
- కలెక్టర్ ఆదేశాలతో మొదలైన చర్యలు



సాక్షి, కామారెడ్డి : తిలా పాపం తలా పిడికెడు అన్నట్లుగా స్కానింగ్‌లు, అబార్షన్లు, శిశు విక్రయాలు తదితర అంశాలలో అందరి పాత్ర ఉంటోంది. పుట్టబోయేది ఆడో మగో తెలుసుకోవడానికి జనం ఆస్పత్రులు, స్కానింగ్ సెంటర్లకు పరుగులు తీస్తుండగా.. వారి ఆసక్తిని సొమ్ము చేసుకుంటూ వాటి నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. పుట్టేది అడబిడ్డ అని తెలియగానే కడుపులోనే చంపేయాలనుకుంటున్నవారి అవసరాన్ని సొమ్ము చేసుకుంటూ అబార్షన్లు చేస్తున్నారు. స్కానింగ్, అబార్షన్ల కోసం రెండు మూడు రాష్ట్రాల నుంచి కామారెడ్డిలోని సమన్విత ఆస్పత్రికి వచ్చేవారంటే.. ఆ ఆస్పత్రి ఎంత ఫేమస్ అయ్యిందో అర్థం చేసుకోవచ్చు. అలాంటి ఆస్పత్రులలో తనిఖీలు చేయకుండా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులూ ఈ పాపంలో భాగమయ్యారు.

ఎంటీపీ యాక్ట్ అనుమతులు లేకపోయినా..

గర్భంలో ఉన్న బిడ్డ ఆరోగ్య పరిస్థితి బాగాలేనపుడు, బిడ్డ వల్ల తల్లికి ప్రమాదం జరిగే అవకాశం ఉన్నపుడు అబార్షన్ చేస్తారు. దీనికి మెడికల్ టర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ యాక్ట్ అనుమతులు పొందాల్సి ఉంటుంది. సమన్విత ఆస్పత్రికి దీనికి సంబంధించి ఎలాంటి అనుమతులు లేవని వైద్యారోగ్య శాఖ అధికారుల విచారణలో వెల్లడైంది. కాగా సమన్విత ఆస్పత్రిలో వైద్య సేవలకు సంబంధించి ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో ఎంటీపీకి సంబంధించి చార్జీలు పొందుపరచడాన్ని చూసి వైద్య ఆరోగ్యశాఖ అధికారుల అవాక్కయ్యారు. మూడు నెలలలోపు గర్భవిచ్ఛిత్తి కోసం రూ. 5 వేలు, మూడు నెలలు దాటిన గర్భవిచ్ఛిత్తి కోసం రూ. 10 వేలు చార్జీగా అందులో పేర్కొనడం విశేషం.

నిబంధనలను తుంగలో తొక్కి..

శ్రీరాంనగర్ కాలనీలోగల సమన్విత ఆస్పత్రికి అనుమతులు ఇచ్చే విషయంలో వైద్యారోగ్య శాఖ అధికారులు నిబంధనలను తుంగలో తొక్కినట్లు స్పష్టమవుతోంది. పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలో గతంలో కౌసల్య ఆస్పత్రి ఉండేది. అందులో లింగ నిర్ధారణ పరీక్షలు, భ్రూణ హత్యలు విచ్చలవిడిగా జరుగుతున్నాయని వైద్య, ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులకు అందిన సమాచారం మేరకు 2021 జూలై 15న పక్కా ప్లాన్‌తో దాడులు నిర్వహించారు. ఆస్పత్రిని సీజ్ చేసిన వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు.. ఆస్పత్రి నిర్వాహకుడు ఇట్టం నడిపి సిద్దరాములుపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. అయితే కౌసల్య ఆస్పత్రి సీజ్ అయిన కొంతకాలానికే ఆస్పత్రి యాజమాన్యం అధికారులను మచ్చిక చేసుకుంది. సీజ్ అయిన ఆస్పత్రికి సమీపంలో నిర్మించిన సొంత భవనంలో సమన్విత ఫర్టిలిటీ సెంటర్ పేరుతో ఆస్పత్రిని ప్రారంభించింది. దీనికి క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ అనుమతి ఇచ్చారు. అలాగే స్కానింగ్ సెంటర్ కోసం గర్భస్థ పిండ నిర్ధారణ పరీక్షల చట్టం (పీసీ అండ్ పీఎన్‌డీటీ) అనుమతి కూడా ఇచ్చారు. స్కానింగ్ సెంటర్‌లో కచ్చితంగా రేడియోలజిస్ట్ లేదా గైనకాలజిస్టు ఉండాలి. కానీ రికార్డుల్లో నమోదు చేసిన వైద్యులెవరూ ఇక్కడ పనిచేసేవారే కాదు. అప్పటికే కేసుల్లో ఇరుక్కున్న యాజమాన్యం కొత్తగా మరో పేరుతో ఆస్పత్రి పెడుతున్నపుడు అనుమతులు ఇచ్చే విషయంలో వైద్యారోగ్య శాఖ అధికారులు నిబంధనలను తుంగలో తొక్కారు. ఇష్టారాజ్యంగా అనుమతులు ఇచ్చారు. జిల్లా కేంద్రంలో మరికొన్ని ఆస్పత్రులకు ఇలాగే ఇష్టారాజ్యంగా అనుమతులు ఇచ్చినట్టు తెలుస్తోంది.

కలెక్టర్ ఆదేశాలతో కదలిక

కామారెడ్డి పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలో గల సమన్విత ఆస్పత్రిలో ఎనిమిది నెలల గర్భిణికి డెలివరీ చేసి, పుట్టిన ఆడ శిశువును విక్రయించిన ఘటన కలకలం సృష్టించిన విషయం తెలిసిందే. ఈ కేసులో వైద్యుడు ఇట్టం నడిపి సిద్దరాములుతో పాటు ఎనిమిది మందిపై కేసులు నమోదు చేసి అరెస్టు చేశారు. కాగా శిశు విక్రయం ఘటనపై కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సీరియస్ అయ్యారు. సదరు ఆస్పత్రిపై చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖను ఆదేశించారు. దీంతో అధికారులు ఫర్టిలిటీ సెంటర్ పేరుతో ఆస్పత్రిలో జరుగుతున్న వ్యవహారంపై సోమవారం విచారణ జరిపారు. సమన్విత ఆస్పత్రి యాజమాన్యానికి షోకాజ్ నోటీస్ ఇచ్చారు. కలెక్టర్‌కు విచారణ నివేదిక అందించారు.

సమన్విత హాస్పిటల్ సీజ్



ఆస్పత్రిని సీజ్ చేస్తున్న వైద్యాధికారులు

సాక్షి ఎఫెక్ట్..

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని శ్రీరాంనగర్ కాలనీలో చట్ట విరుద్ధంగా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్న సమన్విత ఆస్పత్రిని వైద్యాధికారులు సోమవారం సీజ్ చేశారు. ఈ ఆస్పత్రిలో లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం, శిశువును విక్రయించడంపై వచ్చిన ఫిర్యాదు మేరకు రెండు రోజుల క్రితం కామారెడ్డి పట్టణ పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంలో వైద్యుడితోపాటు ఎనిమిది మందిని అరెస్టు చేశారు. ఇంత జరుగుతున్నా ఈ ఘటనపై జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారులు స్పందించకపోవడంపై 'సాక్షి' ఈనెల 8వ తేదీన కథనాన్ని ప్రచురించింది. దీనిపై జిల్లా ఉన్నతాధికారులు, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు స్పందించారు. సమన్విత ఆస్పత్రిపై రోజంతా విచారణ చేపట్టి, ఆధారాలను సేకరించారు. జిల్లా డీఎంహెచ్‌వో చంద్రశేఖర్ సోమవారం రాత్రి 9 గంటలకు పూర్తి ఆధారాలతో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం డిప్యూటీ డీఎంహెచ్‌వో శోభారాణితో కలిసి ఆస్పత్రికి వెళ్లి, వైద్యులకు నోటీసులు ఇచ్చారు. ఈ క్రమంలో వైద్యారోగ్య శాఖ అధికారులకు ఆస్పత్రి నిర్వాహకులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. రాత్రి పదిన్నర గంటలకు ఆస్పత్రిని సీజ్ చేశారు.

పీసీపీఎన్‌డీటీ చట్టం కింద కేసు

సమన్విత హాస్పిటల్, స్కానింగ్ సెంటర్‌లకు మాత్రమే జిల్లా వైద్యశాఖ అనుమతి ఉంది. కానీ సమన్విత హాస్పిటల్, ఫెర్టిలిటీ సెంటర్ పేరుతో లింగ నిర్ధారణ చేసే స్కానింగ్ యంత్రాలు ఏర్పాటు చేసుకుని ఆస్పత్రిని నడుపుతున్నట్లు వైద్యారోగ్య శాఖ అధికారుల విచారణలో తేలింది. అంతే కాకుండా ఓపీ ఏరియాలో ధరల పట్టికలో అనుమతి లేని ఎంటీపీ(అబార్షన్) కోసం రేట్లు కూడా ఉంచారు. హాస్పిటల్ సర్వీసెస్, స్కానింగ్ సెంటర్‌కు సంబంధించిన రికార్డులు, రిజిస్టర్‌లు, రిపోర్టులు కూడా అందుబాటులో లేకపోవడంతో అధికారులు చర్యలకు ఉపక్రమించారు. ప్రీ-కాన్సెప్షన్ అండ్ ప్రీ-నాటల్ డయాగ్నోస్టిక్ టెక్నిక్స్ (పీసీపీఎన్‌డీటీ) చట్టం ప్రకారం భ్రూణహత్యలు, లింగ నిర్ధారణ, స్త్రీ లింగంపై వివక్ష చూపడం నేరం. ఈ చట్టం ప్రకారం ఆస్పత్రిపై కేసు నమోదు చేసి, సీజ్ చేశారు.

ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్‌గా కాసుల బాల్‌రాజ్



బాన్సువాడ: ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్‌గా కాసుల బాల్‌రాజ్‌ను నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. బాన్సువాడ పట్టణానికి చెందిన కాసుల బాల్‌రాజ్.. 2014, 2018 అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసి ఓడిపోయారు. 2023లో నూ ఆయన పార్టీ టికెట్టు ఆశించారు. అయి తే పార్టీ ఆయనను కాదని ఏనుగు రవీందర్‌రెడ్డికి టికెట్టు ఇచ్చింది. కాగా పార్టీకి కాసుల బాల్‌రాజ్ అందించిన సేవలను గుర్తించిన అధిష్టానం.. ఎన్నికల అనంతరం ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్‌గా నియమించింది. దీనికి సంబంధించిన ఉత్తర్వులను సోమవారం విడు దల చేసింది.

ఇంటింటా ఇన్నోవేటర్ పోస్టర్ల ఆవిష్కరణ



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, అధికారులు

కామారెడ్డి క్రైం: ప్రజలలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసి, ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏటా ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ఆవిష్కర్తలకు సాధికారత కల్పించడం, తెలంగాణ అంతటా నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించడమే లక్ష్యంగా కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఆసక్తి గలవారు ఆగస్టు 3వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. నూతన ఆవిష్కరణలు చేసిన వారు తమ దరఖాస్తులను నేరుగా 91006 78543 నంబరుకు వాట్సాప్ ద్వారా పంపాలని సూచించారు. దరఖాస్తులో ఆవిష్కర్త పేరు, వయసు, ఫొటో, వృత్తి, గ్రామం, మండలం, ఆవిష్కరణ పేరు, 100 పదాలలో ఆవిష్కరణ వివరణ, ఆవిష్కరణకు సంబంధించిన నాలుగు ఫొటోలు, ఆవిష్కరణను ప్రదర్శించే రెండు వీడియోలను జత చేయాలని సూచించారు. ఉత్తమ ఆవిష్కరణలకు ఆగస్టు 15 న బహుమతులను అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ బావయ్య, డీపీవో శ్రీనివాస్, డీఏవో భాగ్యలక్ష్మి, డీఈవో రాజు, డీఎంహెచ్‌వో చంద్రశేఖర్, కార్యక్రమ కోఆర్డినేటర్ గగన్ కుమార్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

'వనమహోత్సవాన్ని విజయవంతం చేయాలి'



కామారెడ్డి క్రైం: జిల్లాలో వనమహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జిల్లా అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వనమహోత్సవంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా 17.88 లక్షల మొక్కలను నాటాలన్నది లక్ష్యమన్నారు. ప్రతి శాఖ తమకు కేటాయించిన లక్ష్యాన్ని తప్పనిసరిగా పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, గురుకుల హాస్టళ్లలో మొక్కలు నాటాలన్నారు. అవెన్యూ ప్లాంటేషన్‌లను సైతం ఆకర్శణీయంగా తీర్చిదిద్దాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డీఆర్డీవో చందర్ నాయక్, డీపీవో శ్రీనివాసరావు, సీపీవో రాజారాం, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దయానంద్, డీఏవో భాగ్యలక్ష్మి, కలెక్టరేట్ ఏవో మసూర్ అహ్మద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

'విద్యుత్ సమస్య తలెత్తకుండా చూడాలి'



విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

కామారెడ్డి టౌన్ : వ్యవసాయ మోటార్లకు విద్యుత్ సరఫరాలో సమస్య తలెత్తకుండా చూడాలని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విద్యుత్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ట్రాన్స్‌ఫార్మర్‌లు చెడిపోతే వెంటనే మరమ్మతులు చేయించాలన్నారు. అర్హులకు గృహజ్యోతి లబ్ధి చేకూరేలా చూడాలన్నారు. గ్రామాల్లో లైన్‌మన్‌లు ప్రజలకు అందుబాటులో ఉండి ఉత్తమ సేవలు అందించాలని కోరారు. సమావేశంలో ఎస్ఈ రమేశ్‌బాబు, డీఈలు, ఏఈలు, ఎంపీడీవో, ఎంపీవోలు పాల్గొన్నారు.

రైస్‌మిల్లులలో ప్రత్యేక తనిఖీలు



భిక్కనూరులో తనిఖీ చేస్తున్న టాస్క్‌ఫోర్స్ బృందం

కామారెడ్డి క్రైం: జిల్లాలోని మూడు రైస్‌మిల్లులలో సోమవారం హైదరాబాద్‌నుంచి వచ్చిన మూడు టాస్క్‌ఫోర్స్ బృందాలు ప్రత్యేక తనిఖీలు నిర్వహించాయి. భిక్కనూరు, సదాశివనగర్, పాల్వంచలలోని రైస్‌మిల్లులలో తనిఖీలు కొనసాగాయి. ముఖ్యంగా గతంలో కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించి బియ్యంగా మరాడించడానికి ఇచ్చిన ధాన్యం నిల్వలను పరిశీలించారు. సీఎంఆర్ కోసం అప్పగించిన ధాన్యం విషయంలో మిల్లర్లు చేతివాటం చూపించి పక్కదారి పట్టిస్తున్నారా అనే కోణంలో విచారణ జరిపారు.

రైస్‌మిల్లర్లు చాలా రోజులుగా ప్రభుత్వానికి బకాయి ఉన్న కస్టం మిల్లింగ్ రైస్‌ను తిరిగి ఇవ్వాలని ఇటీవల ప్రభుత్వం జీవోను విడుదల చేసింది. ఇందులో భాగంగా సెప్టెంబర్ 20 వరకల్లా పాత కేటాయింపులకు సంబంధించిన సీఎంఆర్‌ను ప్రభుత్వానికి అప్పగించాల్సి ఉంది. లేదంటే నిబంధనల ప్రకారం మిల్లర్లపై చర్యలు తీసుకునే అవకాశాలున్నాయి. కొందరు మిల్లర్లు ధాన్యాన్ని పక్కదారి పట్టించారనే ఫిర్యాదులు ఉన్నాయి. మిల్లులకు కేటాయించిన ధాన్యాన్ని పక్క జిల్లాలు, ఇతర రాష్ట్రాలకు మిల్లర్లు అమ్ముకుని డీఫాల్టర్‌లుగా ఉన్నారనే ఫిర్యాదులున్నాయి. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ వ్యవహారంపై ప్రత్యేకంగా దృష్టి సారించి, టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేసింది. ఈ బృందాలు సోమవారం జిల్లాలో తనిఖీలు చేపట్టాయి. గతంలో కేటాయించిన బియ్యం నిల్వలు అసలు మిల్లులలో ఉన్నాయా, లేవా అనే కోణంలో తనిఖీలు జరిగాయి. తనిఖీలకు సంబంధించిన నివేదికను కమిషనరేట్‌కు అందించనున్నారు.

ఉపాధ్యాయుడిని పొందుర్తిలోనే కొనసాగించాలి

పాఠశాల ఎదుట తల్లిదండ్రుల ధర్నా



పొందుర్తిలో పాఠశాల ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థులు, గ్రామస్తులు

రాజంపేట : బదిలీల్లో మండలంలోని పొందుర్తి గ్రామానికి వచ్చిన ఉపాధ్యాయుడు ముదాం స్వామిని తమ గ్రామంలోనే కొనసాగించాలని సోమవారం పాఠశాల ఎదుట విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు ధర్నా చేశారు. మండలంలోని శివాయిపల్లిలో డిప్యుటేషన్‌పై పని చేసిన స్వామి పొందుర్తికి బదిలీపై వచ్చారు. అయితే స్వామిని తమ గ్రామంలోనే కొనసాగించాలని శివాయిపల్లి గ్రామస్తులు ఆందోళన చేస్తున్నారు. దీంతో ఆయనను మళ్లీ శివాయిపల్లి పాఠశాలకు డిప్యుటేషన్‌పై పంపడానికి గ్రామ పెద్దలతో కుమ్మక్కై డీఈవో, ఎంఈవో ప్రయత్నిస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు. ఈ విషయమై వినతి పత్రాలు ఇచ్చినా రెండుగ్రామాలు పరిష్కరించుకోవాలని చెప్పారని తెలిపారు. పాఠశాలకు వచ్చిన ఎంఈవో రామస్వామిని గ్రామస్తులు నిలదీశారు. స్వామిని పొందుర్తి పాఠశాలలోనే కొనసాగిస్తామని తెలుపడంతో వారు ఆందోళన విరమించారు.



జిల్లా కేంద్రంలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మహానేత వైఎస్సార్‌కు ఘన నివాళి

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ ఆస్పత్రి వద్ద గల వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ఆయన అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోనె శ్రీనివాస్, పార్టీ పట్టణ అధ్యక్షుడు పండ్ల రాజు, నాయకులు కారంగుల అశోక్ రెడ్డి, నిమ్మ మోహన్‌రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు కన్నయ్య, చాట్ల రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

– కామారెడ్డి టౌన్

క్లుప్తంగా

కళాశాల ఆవరణను శుభ్రంగా ఉంచాలి

కామారెడ్డి టౌన్: కామారెడ్డి మెడికల్ కళాశాల ఆవరణను పరిశుభ్రంగా ఉంచాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ బల్దియా అధికారులకు సూచించారు. సోమవారం ఆమె కాలేజీని సందర్శించారు. ప్రిన్సిపాల్ పెరుగు వెంకటేశ్వర్లును అడిగి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో సానిటరీ ఎస్సై రవీందర్ తదితరులున్నారు.

కాంగ్రెస్ నేతల సంబురాలు



బాన్సువాడ : రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్‌గా కాసుల బాల్‌రాజ్‌ను నియమిస్తూ సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో బాన్సువాడ, బీర్కూర్‌లో కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు సంబరాలు నిర్వహించారు. బాన్సువాడ అంబేడ్కర్ చౌరస్తా వద్ద పటాకులు కాల్చి స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు ఖలేక్, బీర్కూర్ మండల యూత్ అధ్యక్షులు దొంతురాం కాశీరాం, బాన్సువాడ, బీర్కూర్ మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయాలి



కామారెడ్డి టౌన్ : రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్స్, స్కాలర్‌షిప్ బకాయిల నిధులను తక్షణమే విడుదల చేయాలని భారతీయ విద్యార్థి మోర్చా జిల్లా అధ్యక్షుడు ప్రసన్నకుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రూ. 5వేల కోట్లకు పైగా బకాయిలు ఉన్నాయని ఫీజుల కోసం కళాశాలల యజమాన్యాలు విద్యార్థులను ఒత్తిళ్లకు గురి చేస్తున్నారని, సర్టిఫికెట్ ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కళ్యాణ్, కార్తీకర్, తిరుపతి తదితరులున్నారు.

ఫిర్యాదులను పరిష్కరించాలి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్
- ప్రజావాణికి 114 ఫిర్యాదులు



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 114 ఫిర్యాదులు వచ్చాయి. వాటిలో అత్యధికంగా రెవెన్యూ శాఖకు చెందిన భూ సమస్యలే. కలెక్టర్ మాట్లాడుతూ.. దూర ప్రాంతాల నుంచి ఎంతో మంది తమ సమస్యల పరిష్కారం కోరుతూ ప్రతి సోమవారం కలెక్టరేట్‌కు ప్రజలు వస్తుంటాయన్నారు.

ఆయా శాఖల అధికారులు వచ్చిన ఫిర్యాదులను విచారించి వీలైనంత త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. వీటితో పాటు రాష్ట్ర స్థాయిలో జరిగే ప్రజావాణి నుంచి జిల్లాకు వస్తున్న వినతులు, ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, డీఆర్‌డీవో చందర్‌నాయక్, ఏవో మస్రూర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

బిల్లులు ఇప్పించండి సార్



మన ఊరు– మన బడి కార్యక్రమం కింద పాఠశాలల భవన నిర్మాణాలకు సంబంధించిన బిల్లులు ఇప్పించాలని కోరుతూ పలువురు కాంట్రాక్టర్‌లు సోమవారం ప్రజావాణికి వచ్చారు. 2023లో మన ఊరు – మన బడి కింద జిల్లాలోని అనేక పాఠశాలలకు పాత భవనాల స్థానంలో కొత్తవి నిర్మించడానికి మంజూరు ఇవ్వగా తాము కొన్ని భవనాల పనులు చేపట్టామని తెలిపారు. ఆయా భవనాలు ఇంకా నిర్మాణ దశల్లో ఉన్నాయని చెప్పారు. వాటిలో గాంధారి మండలం బూర్గుల్ పాఠశాలకు సంబంధించి రూ.25 లక్షలు, నేరల్ పాఠశాలకు రూ.13 లక్షలు, రాజంపేట బాలికల ఉన్నత పాఠశాలకు రూ.13 లక్షల బిల్లులు రావాల్సి ఉందన్నారు. బిల్లులు ఇప్పించాలని, పనులు కొనసాగేలా చూడాలని కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.

కారుణ్య నియామకాలు చేపట్టాలి



వీఆర్‌ఏల వారసులకు అవకాశం కల్పించే జీవో 81ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ వీఆర్‌ఏల వారసులు ప్రజావాణికి తరలివచ్చారు. గత ప్రభుత్వం 61 ఏళ్లలోపు వారినే రెగ్యులరైజ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. 61 ఏళ్లు నిండిన వీఆర్‌ఏల వారసులకు కారుణ్య నియామకాలు ఇచ్చేందుకు నిర్ణయించి జీవో 81ని విడుదల చేసిందన్నారు. దీనికి సంబంధించి ఇప్పటికే పత్రాలు సమర్పించామని తెలిపారు. కామారెడ్డి జిల్లాకు చెందిన 117 మంది ఉన్నట్లు తెలిపారు. 11 నెలలు గడిచినా నియామక పత్రాలు రాలేదన్నారు. ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి తమకు న్యాయం చేయాలని కోరారు.

కాలేజీ ఇక్కడ.. పాఠాలు అక్కడ!

- గతేడాది బీబీపేటలో ఇంటర్ కళాశాల ప్రారంభం
- అధ్యాపకులను కేటాయించని ప్రభుత్వం
- టీసీలు కావాలంటున్న విద్యార్థులు
- దోమకొండ కళాశాలకు వెళ్లాలని సూచించిన అధికారులు



బీబీపేటలో కళాశాల కొనసాగుతున్న పాఠశాల భవనం

బీబీపేట: ఒక ఊరి కాలేజీలో ప్రవేశం పొందిన ఆ విద్యార్థులు.. మరో ఊరిలో పాఠాలు వింటున్నారు. ఎన్నో పోరాటాలతో తమ గ్రామంలో కళాశాల ఏర్పడిందనే వారి ఆనందం ఎంతో కాలం నిలవలేదు. గత విద్యా సంవత్సరం బీబీపేటలో ప్రభుత్వ జూనియర్ కాలేజీని ఏర్పాటు చేశారు. మొదటి సంవత్సరం బైపీసీ, ఎంపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ గ్రూపులలో 45 మంది విద్యార్థులు ప్రవేశం పొందారు. ఇందులో ఎంపీసీలో 16 మంది, బైపీసీలో ఏడుగురు, సీఈసీలో 20 మంది, హెచ్‌ఈసీలో ఇద్దరు ఉన్నారు.

కళాశాలకు మొత్తంగా కావాల్సింది 12 మంది లెక్చరర్లు అవసరం ఉండగా ప్రభుత్వం ఒకరిని కూడా కేటాయించలేదు. దీంతో గతేడాది ప్రైవేటుగా నలుగురు అధ్యాపకులతో బోధన చేపట్టారు. దీంతో సిలబస్ పూర్తికాకపోవడం, పరీక్షలు సక్రమంగా రాయకపోవడంతో అందరు విద్యార్థులు ఫెయిల్ అయ్యారు.

జీతాలు రాకపోవడంతో మానేసిన లెక్చరర్లు

గతేడాది కాలేజీలో పాఠాలు చెప్పిన ప్రైవేట్ అధ్యాపకులకు జీతాలు ఇవ్వకపోవడంతో వారు మానేశారు. దీంతో ప్రస్తుతం సార్లు లేకుండా పోయారు. కొత్తగా లెక్చరర్లను నియమించకపోవడంతో విద్యార్థులు కళాశాలలో చదవమని తెగేసి చెప్తున్నారు. టీసీలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ వారం రోజుల నుంచి ప్రిన్సిపాల్ జైపాల్‌రెడ్డితో వాగ్వాదం పెట్టుకుంటున్నారు. టీసీలు ఇస్తే కళాశాల ఉంటుందో లేదో అనే భయంతో ప్రిన్సిపాల్ ఇవ్వలేకపోతున్నారు. టీసీ ఇస్తే ఇతర కళాశాలలో ద్వితీయ సంవత్సరానికి అడ్మిషన్ పొందుతామని నోడల్ అధికారి షేక్ సలాం వద్దకు సైతం వెళ్లారు. దీంతో నోడల్ అధికారి దోమకొండ జూనియర్ కళాశాలలో తరగతులు వినాలని విద్యార్థులకు సూచించారు. దీంతో దోమకొండ వెళ్లడానికి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం పట్టించుకొని బీబీపేటలోనే తరగతులు కొనసాగేలా చేయాలని కోరుతున్నారు.

సిబ్బందిని కేటాయించాలి



నూతనంగా ప్రారంభమైన కళాశాలలో అడ్మిషన్ పొందినప్పటికీ సిబ్బంది, వసతులు లేకపోవడంతో పాస్ కాలేకపోయాను. ఇప్పుడు దోమకొండ కళాశాలకు వెళ్లాలంటే ఇబ్బందులు పడాల్సి వస్తోంది. టీసీలు ఇవ్వాలని, లేకుంటే లెక్చరర్స్‌ను కేటాయించాలని కోరినప్పటికీ పట్టించుకోవడం లేదు.

– రఘువంశి, ఇంటర్ విద్యార్థి

ఉన్నతాధికారులకు తెలిపాం



నూతనంగా ప్రవేశపెట్టిన కళాశాలలో సిబ్బందితో పాటు భవనం సైతం లేకపోవడం వాస్తవమే. దీనిపై ఉన్నతాధికారులకు చాలా సార్లు విన్నవించాం. కానీ అధికారికంగా ఎలాంటి ఉత్తర్వులు రాలేదు. దీంతో సిబ్బందిని కేటాయించలేదు. విద్యార్థులు టీసీలు కోసం మా దగ్గరకు వచ్చారు. సిబ్బందిని కేటాయించే వరకు దోమకొండ ఇంటర్ కళాశాలలో తరగతులకు హాజరు కావాలని సూచించాం.

– షేక్ సలాం, ఇంటర్ నోడల్ అధికారి, కామారెడ్డి

గుంతలతో తిప్పలు



మద్నూర్‌లో లారీలోంచి పడిపోయిన సంచులు

మద్నూర్: మద్నూర్‌లోని పెద్ద శక్కర్గకు వెళ్లే దారిపై గల గుంతలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. రోడ్డుపై గుంతలు ఉండటంతో సోమవారం పత్తి గింజల లోడుతో వెళ్తున్న లారీలోంచి సంచులు కింద పడిపోయాయి. ఈ మార్గంలో పెద్ద గుంతలు ఉన్నాయి. అదే దారిలో పత్తి ఫ్యాక్టరీలు ఉండడంతో భారీ లోడు వాహనాలు నిత్యం వెళ్తుంటాయి. అధికారులు స్పందించి గుంతలు పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు.

నేరాల నియంత్రణకు సహకరించాలి



బీబీపేట : ప్రస్తుతం జరుగుతున్న నేరాల నియంత్రణకు ప్రజలు కూడా సహకరించాలని డీఎస్పీ నాగేశ్వర్‌రావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పోలీసుస్టేషన్‌ను సందర్శించిన ఆయన మాట్లాడారు. స్టేషన్‌లోని పలు రికార్డులను పరిశీలించారు. స్టేషన్ పరిధిలో ఎప్పటికప్పుడు పోలీసుల నిఘా తప్పనిసరిగా ఉంటుందని, రాత్రుల్లో సైతం ప్రత్యేక నిఘా పెట్టి పరిశీలిస్తున్నామని అన్నారు. ప్రతి నెలలో జరిగిన నేరాల రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట బిక్నూర్ సీఐ సంపత్, ఎస్ఐ ప్రభాకర్ ఉన్నారు.

మిఠాయి దుకాణాల్లో తనిఖీ

సాక్షి ఎఫెక్ట్..



స్వీట్ షాప్‌లో తనిఖీలు చేస్తున్న అధికారులు

మద్నూర్: మిఠాయి దుకాణాల్లో నాణ్యత ప్రమాణాలు, పరిశుభ్రత పాటించకపోతే చర్యలు తప్పవని జిల్లా ఫుడ్ సేఫ్టీ డిసిగ్నేటెడ్ అధికారి శిరీష హెచ్చరించారు. 'పరిశుభ్రత పాటించని స్వీట్ల దుకాణాలు' శీర్షికన ఆదివారం సాక్షి పత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. సోమవారం మద్నూర్‌లోని స్వీట్ల దుకాణాల్లో తనిఖీలు చేశారు. దుకాణాల్లో గడువు ముగిసిన ఉత్పత్తులను పారవేసినట్లు వారు తెలిపారు. పరిశుభ్రత, ఆహార భద్రతా ప్రమాణాలపై దుకాణాదారులకు పలు సూచనలు, సలహాలు అందించారు. కొన్ని అనుమానిత ఉత్పత్తుల నమూనాలను సేకరించారు. ల్యాబ్ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి సునీత తదితరులున్నారు.

తండ్రి హత్యకేసులో జీవితఖైదు

కామారెడ్డి క్రైం: తండ్రిని దారుణంగా హతమార్చిన కొడుకుకి కామారెడ్డి కోర్టు జీవిత ఖైదు విధించింది. వివరాలు ఇలా ఉన్నాయి.. బీబీపేట గ్రామానికి చెందిన బోయిని నర్సయ్య(60) పంట పొలం వద్ద 2019 మే 7న హత్యకు గురయ్యాడు. మృతుడి కోడలు లక్ష్మి ఫిర్యాదు మేరకు బీబీపేట పోలీసులు కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. ఆస్తి పంచకుండా తనతోపాటు తన భార్యాపిల్లలను ఇబ్బందులకు గురిచేస్తున్నాడనే కక్షతో నర్సయ్యను అతడి పెద్ద కొడుకు రాజయ్య హత్య చేసినట్లు తేల్చారు. స్థానిక సంస్థల ఎన్నికల రోజున పంటపొలాల్లోకి ఎవరూ రారని భావించి అదే రోజున పొలం పనులు చేసుకుంటున్న తండ్రి నర్సయ్యను కొట్టి చంపినట్లు నిర్ధారించి రిమాండ్‌కు తరలించారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన జిల్లా న్యాయమూర్తి ఆర్ఆర్ వరప్రసద్ నిందితుడికి జీవిత ఖైదు, రూ.10 వేలు జరిమానా విధిస్తూ సోమవారం తీర్పు వెలువరించారు. కేసు పరిశోధన, సాక్ష్యాలను సక్రమంగా ప్రవేశపెట్టడంలో విశేషంగా కృషి చేసిన సీఐలు యాలాద్రి, రాజశేఖర్, పోలీసుల తరఫున వాదనలు వినిపించిన పీపీ రాజగోపాల్‌గౌడ్, సాక్షులను సకాలంలో ప్రవేశపెట్టిన ప్రస్తుత సీఐ సంపత్‌కుమార్, ఎస్సై ప్రభాకర్, కోర్టు కానిస్టేబుళ్లు నరేశ్‌గౌడ్, అనిల్ కుమార్‌లను ఎస్పీ సింధుశర్మ అభినందించారు.

చోరీ కేసులో ఐదు నెలలు..

ఎల్లారెడ్డి: చోరీ కేసులో ఒకరికి ఐదు నెలల జైలు శిక్ష విధిస్తూ ఎల్లారెడ్డి మున్సిఫ్ కోర్టు న్యాయమూర్తి హారిక సోమవారం తీర్పు వెలువరించినట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. రాంపూర్ గ్రామానికి చెందిన పాల్ అలియాస్ ప్రవీణ్ గ్రామంలోని ద్యావల మీన అనే ఇంట్లోకి గత ఫిబ్రవరి 15న చొరబడి చోరీకి పాల్పడ్డాడు. నిందితుడి పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా, ఐదు నెలల జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించినట్లు ఎస్సై తెలిపారు.

క్రైం కార్నర్

బైక్ అదుపుతప్పి ఒకరి మృతి

రామారెడ్డి: బైకు అదుపుతప్పిన ఘటనలో ఒకరు మృతి చెందారు. పోసానిపేట గ్రామ పరిధిలో ఆదివారం ఈ ఘటన చోటుచేసుకుంది. ఎస్సై విజయ్ కొండ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. ప్రకాశం జిల్లా సీఎస్ పురం మండలం శివంవారి పల్లెకు చెందిన గంజారపల్లి అనిల్(45) ఉపాధి నిమిత్తం మండలంలోని పోసానిపేటకు వచ్చి భవన నిర్మాణ కార్మికుడిగా పని చేస్తున్నాడు. ఆదివారం రాత్రి బైక్‌పై ఉప్పల్‌వాయికి వెళ్లి తిరిగి వస్తుండగా పోసానిపేట 'టీ' జంక్షన్‌లో బైక్ అదుపుతప్పి అనిల్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తమ్ముడు ఆంజనేయులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చేపలవేటకు వెళ్లి..



మోపాల్(నిజామాబాద్‌రూరల్): చేపల వేటకు వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తు కాళ్లు, చేతులకు వలచుట్టుకోవడంతో మృతి చెందాడు. ఎస్‌హెచ్‌వో గంగాధర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని సింగంపల్లికి చెందిన పల్లికొండ నర్సయ్య (38) గ్రామంలోని కొచ్చెరువులో సోమవారం ఉదయం చేపల వేటకు వెళ్లాడు. చేపలకోసం వేసిన వల ప్రమాదవశాత్తు నర్సయ్య కాళ్లు, చేతులకు చుట్టుకోవడంతో నీటిలో మునిగిపోయాడు. గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించగా గజ ఈతగాళ్ల సహాయంతో మృతదేహాన్ని బయటికి తీయించారు. మృతుడి భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు నర్సయ్యకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

చెరువులోపడి పశువుల కాపరి..

మాక్లూర్: మండలంలోని మానిక్‌బండార్ భీం చెరువులో ప్రమాదవశాత్తు పడి సాయినాథ్ (31) అనే పశువులకాపరి సోమవారం మృతి చెందాడు. ఎస్సై సుధీర్‌రావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మోపాల్ మండలం కంజర్ గ్రామానికి చెందిన సాయినాథ్ బతుకుదెరువు కోసం మూడేళ్ల క్రితం మానిక్‌బంధార్‌కు వచ్చి పాలేరుగా పని చేస్తున్నాడు. రోజులాగే పశువులను మేతకు తీసుకెళ్లగా అవి చెరువులోకి దిగాయి. పశువులను బయటకు వెళ్తుండగా సాయినాథ్ నీటమునిగి మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అట్రాసిటీ కేసులో నలుగురి రిమాండ్

నందిపేట్(ఆర్మూర్): మండలంలోని తల్వేద గ్రామానికి చెందిన నలుగురిని అట్రాసిటీ కేసులో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. తల్వేద గ్రామ పరిధిలోని 539/1, 539/3/1, 539/4/1 సర్వేనంబర్లలో బొమ్మన పెద్దన్నకు 4.15 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఆ భూమిలో నుంచి కొందరు దౌర్జన్యంగా దారి వేస్తుండగా పెద్దన్న అడ్డుచెప్పడంతో సదరు వ్యక్తులు దాడి చేశారు. ఈ ఘటనపై బాధితుడి భార్య పోసాని పోలీసులకు ఫిర్యాదు చేయగా, చిక్లి చిన్నరాజన్న, నడిపెరం పెద్ద చిన్నయ్య, మగ్గిడి నడ్పి రాజన్న, గోవుల పోతన్నను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

మాక్లూర్: మండలంలోని అడవిమామిడిపల్లి శివారులోని రహస్య ప్రాంతంలో కొనసాగుతున్న పేకాటస్థావరంపై సోమవారం దాడి చేసి ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ విష్ణుమూర్తి తెలిపారు. పట్టుబడిన వారితోపాటు వారి నుంచి స్వాధీనం చేసుకున్న రూ.14వేల నగదు 5 సెల్‌ఫోన్లను మాక్లూర్ పోలీసులకు అప్పగించామన్నారు. దాడిలో సీఐ పురుషోత్తం, హెడ్‌కానిస్టేబుల్ లస్మన్న, రాజేశ్వర్, గజేందర్, అనిల్, అజాం పాల్గొన్నట్లు తెలిపారు.

ఇంటి తాళం పగులగొట్టి రూ.4లక్షలు చోరీ

- నవీపేటలోని సుభాష్‌నగర్‌లో ఘటన



నవీపేటలో స్థానికులను విచారిస్తున్న పోలీసులు

నవీపేట: మండల కేంద్రంలోని సుభాష్‌నగర్ కాలనీలో తాళం వేసిన ఇంట్లో చోరీకి పాల్పడిన దుండగులు రూ.4లక్షలు ఎత్తుకెళ్లారు. ఆదివారం రాత్రి జరిగిన ఘటనకు సంబంధించిన వివరాలను ఎస్సై యాదగిరిగౌడ్ వెల్లడించారు.. బీడీ కంపెనీలో ప్యాకర్‌గా పని చేసే సయ్యద్ మీర్ హౌసింగ్ లోన్ చెల్లించేందుకు రూ.4 లక్షలు అప్పుగా తీసుకువచ్చి ఇంట్లోని బీరువాలో దాచాడు. నందిపేటలోని బంధువుల ఇంట్లో శుభకార్యం ఉండడంతో కుటుంబ సభ్యులతో కలిసి శనివారం వెళ్లాడు. ఇంటికి తాళం వేసి ఉండడాన్ని గమనించిన దుండగులు ఆదివారం రాత్రి తాళాన్ని పగులగొట్టి లోనికి ప్రవేశించారు. బీరువా తాళాలు పగులగొట్టి అందులోని రూ.4 లక్షల నగదును ఎత్తుకెళ్లారు. సోమవారం ఉదయం ఇంటికి వచ్చిన సయ్యద్ మీర్ చోరీ జరిగినట్లు గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. క్లూస్ టీమ్ వేలిముద్రలను సేకరించింది. డాగ్‌స్క్వాడ్‌తో పరిసరాలను పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఎయిర్‌పోర్టుకు వెళ్లి వచ్చే సరికి..

ఖలీల్‌వాడి: బావను దుబాయ్ ఫ్లైట్ ఎక్కించి ఇంటికి వచ్చే సరికి దుండగులు చోరీకి పాల్పడిన ఘటన నగరంలోని ఆటోనగర్‌లో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. ఆరో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆటోనగర్‌కు చెందిన రఫీక్.. తన బావ దుబాయికి వెళ్తుండడంతో ఆయనను ఫ్లైట్ ఎక్కించేందుకు ఆదివారం రాత్రి హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లాడు. సోమవారం ఉదయం 10 గంటలకు తిరిగి ఇంటికి చేరుకోగా తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లోని బీరువా నుంచి 20 తులాల బంగారం, వెండి, నగదును దుండగులు ఎత్తుకెళ్లినట్లు గుర్తించిన బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మొగులయ్య తెలిపారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

- అటవీ అధికారులు వేధిస్తున్నారని ఆరోపణ
- అసత్య ఆరోపణలు చేస్తున్నాడన్న అధికారులు



శోభన్‌తో మాట్లాడుతున్న ఎఫ్ఆర్‌వో ఓంకార్

ఎల్లారెడ్డి: పాత టేకు కర్రలను తీసుకెళ్తున్న తనను పట్టుకొని అటవీ అధికారులు వేధిస్తున్నారని గాంధారి మండలం గండివేట్‌కు చెందిన యువకుడు నామాల శోభన్ ఆత్మహత్యాయత్నం చేశాడు. స్థానికులు గమనించడంతో పెద్ద ప్రమాదం తప్పింది. పట్టణంలో సోమవారం ఈ ఘటన చోటుచేసుకుంది. శోభన్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. తన బైక్‌పై పాత టేకు కర్రలను తీసుకుని వస్తుండగా బేస్ క్యాంపు అటవీశాఖ సిబ్బంది పట్టుకున్నారని, పాత కర్రలు తీసుకెళ్తున్నానని చెప్పినా వినకుండా అధికారులు రూ.20వేలు డిమాండ్ చేశారని శోభన్ ఆరోపించాడు. తన వద్ద ఉన్న రూ.2వేలు తీసుకుని విడిచిపెట్టాలని వినకుండా బైక్‌తోపాటు పాత టేకుకర్రలను అటవీశాఖ కార్యాలయానికి తీసుకువచ్చారని తెలిపాడు. సాయంత్రం వరకు అధికారులు రాకపోగా, తన బాధను ఎవరూ వినకపోవడంతో ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేశానని పేర్కొన్నాడు. దీనిపై ఎఫ్ఆర్‌వో ఓంకార్‌ను వివరణ కోరగా, బైక్‌పై టేకు కర్రలు తరలిస్తుండగా పట్టుకోవడంతో తమపై అసత్య ఆరోపణలు చేస్తున్నాడని అన్నారు. శోభన్‌ను ఎవరూ డబ్బులు అడగలేదని స్పష్టం చేశారు.

లైంగికంగా వేధించి.. ఆస్తి కాజేశాడు

మోర్తాడ్(బాల్కొండ): వితంతును లైంగిక వేధించి ఆస్తి కాజేసిన ఘటన ఏర్గట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాలు.. తపాల శాఖలో ఉద్యోగం చేస్తున్న వ్యక్తి గ్రామంలోని ఓ వింతతుపై కన్నేశాడు. ఆమెపై పలుమార్లు లైంగికదాడి చేశాడు. ఆమె వద్ద ఉన్న ఇంటి స్థలాలు, నగదు, నగలు ఇలా దాదాపు రూ.50లక్షల విలువైన ఆస్తిని కాజేశాడు. ఎవరికైన చెబితే ఫొటోలు, వీడియోలు సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేస్తానని బెదిరించాడు. నిందితుడి కుటుంబ సభ్యులు కూడా బాధితురాలిపై దాడి చేశారు. దీంతో ఆమె ఆదివారం ఏర్గట్ల పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. నిందితుడిని పోలీసులు స్టేషన్‌కు పిలిపించి విచారణ చేపట్టారు.

తెయూ హాస్టల్ విద్యార్థి సస్పెండ్

- బాలుర హాస్టల్‌లో బాలికకు వసతి
- ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ న్యూబాయ్స్ హాస్టల్ విద్యార్థిని క్రమశిక్షణ చర్య కింద వర్సిటీ ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. 15 రోజుల కింద జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వర్సిటీ విద్యార్థులు తెలిపిన వివరాలు.. ఖమ్మం జిల్లాకు చెందిన విద్యార్థి తెయూలో బోటనీ ఫైనలియర్ చదువుతూ క్యాంపస్‌లోని న్యూ బాయ్స్ హాస్టల్‌లో ఉంటున్నాడు. అతడితో కలిసి డిగ్రీ చదివిన స్నేహితురాలు సుమారు 15 రోజుల క్రితం యూనివర్సిటీకి వచ్చింది. అప్పటికే రాత్రి కావడంతో ఆమెను తన గదిలోనే ఉంచాడు. మరుసటి రోజు ఉదయం హాస్టల్‌లో బాలిక ఉండటం గమనించిన విద్యార్థులు విషయాన్ని వార్డెన్‌కు సమాచారం ఇచ్చారు. ఈ విషయం బయటకు పొక్కడంతో రిజిస్ట్రార్ యాదగిరి చర్యలు తీసుకున్నారు. విద్యార్థిని హాస్టల్‌తో పాటు యూనివర్సిటీ నుంచి సస్పెండ్ చేసినట్లు రిజిస్ట్రార్ తెలిపారు. ఈ విషయంలో హాస్టల్ సెక్యూరిటీ సిబ్బందితో పాటు వార్డెన్ నిర్లక్ష్యం ఉందని విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. కాగా సస్పెండ్‌కు గురైన సదరు విద్యార్థి నాలుగైదు రోజులుగా వర్సిటీ క్యాంపస్‌లోనే తిరుగుతున్నట్లు సమాచారం. తనను పరీక్షలు రాయనివ్వాలని బోటనీ విభాగాధిపతి, వర్సిటీ ఉన్నతాధికారులకు మొరపెట్టుకోగా తిరస్కరించినట్లు తెలిసింది.

రైలుకు ఎదురెళ్లి ఆత్మహత్య



ఖలీల్‌వాడి: నిజామాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలోని జగిత్యాల – కోరుట్ల ప్రాంతంలో రైలుకు ఎదురెళ్లి ఒకరు ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి సోమవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. జగిత్యాల జిల్లా కోరుట్ల మండలంలోని ఎకిన్‌పూర్ గ్రామానికి చెందిన నర్సయ్య(41)కు మతిస్థిమితం లేదు. ఈ క్రమంలో ఆయన రైలుకు ఎదురెళ్లి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గంజాయి కేసులో ఒకరి అరెస్ట్

జక్రాన్‌పల్లి: గంజాయి కలిగి ఉన్న వ్యక్తిని మండలంలోని మనోహరాబాద్ శివారులో అరెస్ట్ చేసినట్లు ఎస్సై తిరుపతి సోమవారం తెలిపారు. మనోహరాబాద్ గ్రామ శివారులోని సాయిబాబా ఆలయం వద్ద వేల్పూర్ మండలంలోని పచ్చల నడ్కుడకు జల్గా శేఖర్‌ను అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా అతడి వద్ద 1.2 కేజీల గంజాయి లభించిందన్నారు. శేఖర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.